క్లుప్తంగా

విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరం



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికల ఉన్నత పాఠశాలలో 9,10 తరగతుల విద్యార్థినులకు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మాక్సీవిజన్ సూపర్ స్పెషాలిటీ ఐ హాస్పటల్–విజయవాడ బృందం కంటి పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని రోటరీ క్లబ్ బాధ్యులు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు, కార్యదర్శి డి.మురళీకృష్ణ, ఈదర పూర్ణచంద్, గుత్తా వెంకట రత్నం, పావులూరి రాంబాబు, కన్నెగంటి మురళీకృష్ణ, కె.ఉపేంద్ర, ఆలపాటి కిరణ్, వెంపటి హరిప్రసాద్, మల్లాది అర్జున్, ఆర్.సుబ్బారావు, ఎస్.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాసమితి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



తెనాలి: భగవత్ కృప పొందటానికి ఏ సాధనము అవలంబించాలో శాస్త్రాలు తెలియజేశాయనీ, ఆ ప్రకారం కలియుగంలో దానం ముఖ్యమైందని శ్రీసాయిప్రసాదం సేవాసమితి అధ్యక్షుడు సాయి లక్కరాజు అన్నారు. సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్‌లోని పట్టణ పేద నిరాశ్రయుల ఆశ్రమంలోని పేదలకు అన్నప్రసాద వితరణ చేశారు. కృతయుగంలో తపస్సు, త్రేతాయుగంలో జ్ఞానం, ద్వాపరయుగంలో యజ్ఞం అనుసరించాల్సిన సాధనాలుగా వివరించారు. అన్నదాన వితరణను చిట్టూరి నాగరాజు, అరుణలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సేవాసమితి సభ్యుడు విశ్రాంత ఎంపీడీవో జె.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ నమోదు చేసుకోవాలి



దుగ్గిరాల: అన్నదాత సుఖీభవ పథకానికి రైతులు తమ సమీపంలోని రైతుసేవా కేంద్రంలో ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏవో విజయబాబు తెలిపారు. మండల గ్రామాలైన మోరంపూడి, రేవేంద్రపాడులలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలోని అర్హత కలిగిన రైతులు 8,365 ఉండగా.. 8,032 రైతులు ఈకేవైసీ నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు శుక్రవారం లోపు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. ఖరీఫ్ సాగు కోసం సబ్సిడీపై విత్తనాలు, కౌలు రైతుల సాగు హక్కు పత్రం కావాల్సిన రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



సాక్షి ఎఫెక్ట్

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ ఉండవల్లి హరిజనవాడలో గత ఐదు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. దీనిపై సాక్షిలో గురువారం 'వృథాగా పోతున్న తాగునీరు!' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ అలీమ్‌బాషా ఉండవల్లి హరిజనవాడలో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. దీంతో ఉండవల్లి వాటర్ లైన్‌కు చెందిన సిబ్బంది వెంటనే మరమ్మతులు నిర్వహించి తాగునీటి వృథాను అరికట్టారు. పైపులైన్‌ను మరమ్మతులు చేయించిన కమిషనర్‌కు స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు.

కేఎల్‌యూ హాస్టల్ భవనాల నుంచి మురుగు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్, వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ హాస్టల్ భవనాల నుంచి విడుదలవుతున్న మురుగునీటిని అరికట్టాలని సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. వందలాది మంది విద్యార్థులు నివాసముంటున్న భవనాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా నిర్మించుకోకపోవడంతో నిర్వాహకులు రహదారిపై మురుగునీటిని వదులుతున్నారని.. దీంతో రహదారిపై ప్రయాణించే గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఆరు నెలలు.. ప్లాంటు మూతబడి!!

- నిలచిన మలఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ సేవలు
- పాడైన మోటర్లు, రేకులకు రంధ్రాలు
- రోడ్లపైనే పోస్తున్న మల వ్యర్థాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు



కంపోస్ట్ యార్డులో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్



ఇనుప రేకులకు ఏర్పడిన రంధ్రాలు

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో తొలిసారి తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మల ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ సేవలు ఆరు నెలలుగా పూర్తిగా నిలచిపోయాయి. మోటర్లు పాడైపోవటం... శుద్ధిచేసే ప్లాంట్‌లోని ఇనుప రేకులు తప్పు పట్టి రంధ్రాలు పడటంతో దాని నిర్వహణను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. దీంతో పట్టణంలో సేకరించిన మల వ్యర్థాలను రోడ్ల ప్రక్కన పోస్తున్నారు. వీటి నుంచి వచ్చే దుర్వాసన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తెనాలి పురపాలక సంఘ పరిధిలో 12 కమ్యూనిటీ టాయిలెట్స్ ఉన్నాయి. ఇవి కాకుండా పట్టణంలో 57 వేల నివాస గృహాలు ఉన్నాయి. పురపాలక సంఘ పరిధిలోని కమ్యూనిటీ టాయిలెట్స్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లు రెండు నెలలకు నిండుతూ ఉంటాయి. పురపాలక సంఘ పరిధిలోని ట్యాంకర్‌తో వచ్చిన మల ఘన వ్యర్థాలను గతంలో శివారు ప్రాంతాల్లోని రోడ్లవెంట పోస్తుండే వారు. అలాగే సెప్టిక్ ట్యాంక్‌లను క్లీన్ చేసే ప్రైవేట్ వాహనదారులు కూడా ఇదే విధంగా శివారు ప్రాంతాల్లో వాటిని పోస్తు వచ్చారు. దీనివల్ల రోడ్లపై వెళ్ళే వారికి దుర్వాసన రావటంతో పాటు ఇబ్బందులు ఏర్పడేవి.

2017 ఎఫ్ఎస్‌టీపీల ఏర్పాటుకు సూచన

రాష్ట్ర ప్రభుత్వం ఫీకల్ స్లజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎఫ్ఎస్‌టీపీ)లను ఏర్పాటు చేసుకోవాలని 2017లో సూచించింది. దీంతో అప్పటి పాలకులు, ప్రజాప్రతినిధులు తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని కంపోస్ట్ యార్డులో రూ.20 లక్షలు వెచ్చించి మల ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఇది తొలిప్లాంట్ కావటంతో అప్పట్లో రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల అధికారులు, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు కన్సల్టెన్సీ ప్రతినిధులు తెనాలి వచ్చి దీనిని పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

పట్టణంలో 10 సెప్టిక్ ట్యాంక్ వాహనాలు

తెనాలి పట్టణంలో సెప్టిక్ ట్యాంక్‌లను క్లీన్‌చేసే అయిదు ప్రైవేట్ ఏజన్సీలు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఏజన్సీలకు చెందిన 9 వాహనాలు, మున్సిపల్ పరిధిలోని ఒక వాహనం మలఘన వ్యర్థాలను సేకరిస్తుంటాయి. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ ద్వారా 28,000 లీటర్లను ప్రతిరోజు శుద్ధి చేసే అవకాశం ఉంది. ఒక్కో ట్యాంకర్ కేపాసిటీ మూడు వేల లీటర్లు... అంటే సుమారు 9 ట్యాంకర్ల మలఘన వ్యర్థాలను ప్లాంట్‌లో శుద్ధి చేసే అవకాశం ఉంది.

ప్లాంట్ పనిచేసే విధానం ఇది

ట్యాంకర్లతో తీసుకువచ్చిన మల వ్యర్థాలను ముందుగా ప్లాంట్ వద్ద ఉన్న ట్యాంక్‌లో పోస్తారు. దానిలోని యంత్రం దానిని శుద్ధి చేసి ఘన వ్యర్థాలను ఒక ట్యాంక్‌కు, శుద్ధి చేసిన నీటిని మరో ట్యాంక్‌కు పంపుతుంది. శుద్ధి చేసిన నీటిని పట్టణంలోని డివైడర్ల వద్ద ఏర్పాటు చేసిన మొక్కలకు, కంపోస్టు యార్డులోని మొక్కల నిర్వహణకు ఈ నీటినే ఉపయోగిస్తున్నారు. శుద్ధి చేసే సమయంలో వచ్చే అతి తక్కువ ఘన వ్యర్థాన్ని కంపోస్టుగా మొక్కలకు ఉపయోగించుకుంటారు.

త్వరలో పరిష్కరిస్తాం



ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్ సేవలు నిలచిపోయిన మాట వాస్తవం. గతంలో ప్రభుత్వం ఇచ్చిన స్కీం కాలపరిమితి ముగియడంతో దాని సేవలు నిలచిపోయాయి. పూలే కాలనీలో నూతనంగా ఎస్ఎఫ్‌టీ ప్లాంట్‌ను నిర్మించాం. దానిలో ఎస్ఎఫ్‌టీపీని కూడా ఏర్పాటు చేశాం. దానిని త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అది అందుబాటులోకి రాగానే సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

– ఆకుల శ్రీనివాసరావు, డీఈ, తెనాలి పురపాలక సంఘం

పాడైన రెండు మోటర్లు.. రంధ్రాలు పడిన రేకులు

ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్‌లో ఆరు మోటర్లు ఉంటాయి. వాటి ద్వారా మలఘన వ్యర్థాల నిర్వహణను చేస్తుంటారు. అయితే వాటిలో రెండు మోటర్లు గతంలో పాడైపోయాయి. అంతేకాకుండా ప్లాంట్‌లోని కొన్ని యంత్రాలను ఇనుప రేకులతో ఏర్పాటు చేశారు. వాటికి తుప్పుపట్టి రంధ్రాలు పడ్డాయి. దీంతో ప్లాంట్ నిర్వహణను ఆరు నెలల నుంచి నిలిపివేశారు. దీనివల్ల మున్సిపల్ కమ్యూనిటీ టాయిలెట్స్ నుంచి, ప్రైవేట్ వాహనాల ద్వారా వచ్చే మల ఘన వ్యర్థాలను ప్రస్తుతం రోడ్ల వెంట పోస్తున్నారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు స్పందించి ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్ సేవలు అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

యోగాతో చక్కని జీవన విధానం

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



యోగాంధ్ర అక్షరాలను ప్రతిబింబించే విధంగా ప్రదర్శించిన విద్యార్థులు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: యోగాతో మంచి జీవన విధానం అలవడే అవకాశం ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ వద్ద యోగాంధ్ర-2025 అనే అక్షరాలను ప్రతిబింబించే విధంగా విద్యార్థులు గురువారం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఇన్‌చార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకల్లో భాగంగా యోగాంధ్రను రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిరోజు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దాసరి వీర వసంతరావు, గొడవర్తి శ్రీసాయి హరేరామ్, ఏసీపీలు శివన్నారాయణ, వాణి, మేనేజర్ విల్సన్ జయకర్, ఆర్‌వో రాంప్రసాద్, మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు తెనాలిలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

తెనాలిఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శనివారం తెనాలిలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 8.30 గంటల వరకు గాంధీచౌక్ నుంచి మార్కెట్ వరకు మెగా యోగా వేడుకలను నిర్వహించనున్నట్లు చెప్పారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పాల్గొంటారని వివరించారు. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు, పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

క్షయవ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

టి.బి.యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి.రవికుమార్



ర్యాలీలో పాల్గొన్న రవికుమార్

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధి నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని టి.బి.యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ పి.రవికుమార్ పేర్కొన్నారు. క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని అంగలకుదురులో గురువారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి క్షయ వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల నుంచి దగ్గు, జ్వరం ఉన్నట్లయితే పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, అలసట రావడం, కళ్లలో రక్తం కనబడటం వంటివి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో క్షయ వ్యాధి పరీక్షలు ఉచితంగా చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌వీ వాకా దిలీప్‌కుమార్, సౌజన్య, ఆశ కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్లను వెంటనే అందజేయండి

ఆర్ఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ పి.పార్వతి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న డైరెక్టర్ పార్వతి

తెనాలిఅర్బన్: స్టాక్ పాయింట్‌లకు వచ్చిన విద్యామిత్ర కిట్లను వెంటనే విద్యార్థులకు పంపిణీ చేయాలని విద్యామిత్ర కార్యక్రమ జిల్లా స్పెషల్ ఆఫీసర్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్ రాష్ట్ర డైరెక్టర్ పి.పార్వతి ఆదేశించారు. తెనాలి చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్‌ను గురువారం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన విద్యామిత్ర స్టాక్ పాయింట్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఇంకా కిట్లు ఉండటాన్ని గమనించిన ఆమె వాటిని ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే వారం రోజులు అయిన పంపిణీ చేయకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. వాటన్నింటిని ఆయా పాఠశాలలకు పంపిచాలని ఆదేశించారు. అనంతరం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు. కోడిగుడ్డు ఉడకపెట్టి అందించడాన్ని పరిశీలించిన ఆమె అలా చేయవద్దని, ఫ్రై చేసి విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యామిత్ర కిట్ల పంపిణీని పరిశీలించేందుకు తెనాలి రావడం జరిగిందన్నారు.ఆమె వెంట ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, పలువురు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అపరిశుభ్రంగా మురుగు కాలువ



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రకాష్‌నగర్ యూపీహెచ్‌సీ సమీపంలో రోడ్లపై మురుగు పారుతూ దోమలు వృద్ధి చెందుతున్నాయి. డ్రైనేజీలో పురుగులు సైతం తాండవిస్తున్నాయని, ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని సాక్షిలో కథనం వెలువడింది. కార్పొరేషన్ అధికారులు సైతం రోడ్డుపైకి మురుగు రాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. గురువారం మరోసారి అక్కడకు వెళ్లి పరిశీలించగా డ్రైనేజీలు మాత్రం పురుగులతో అపరిశుభ్రంగా దర్శనమిచ్చాయి. ఆ పురుగులు నివాసాల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కార్పొరేషన్ అధికారులు వెంటనే డ్రైనేజీని శుభ్రం చేయాలని పలువురు కోరుతున్నారు.

త్వరలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు

- మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్న ప్రభుత్వం
- నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ



మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

నాదెండ్ల: రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా త్వరలో నల్లబర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల రైతు భరోసా కేంద్రంలో గురువారం నల్లబర్లీ సాగు చేసిన రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం ప్రకటించిన కొన్ని సూచనలు పాటించినట్లయితే మొదటి రకానికి క్వింటా రూ.12 వేలు, రెండో రకానికి రూ.6 వేలు చొప్పున చెల్లించనున్నట్లు తెలిపారు. సాగుదారులు రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏల సాయంతో సీఎంఏపీపీ యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రం పరిధిలో ఎంతమంది రైతులు ఉన్నారన్న వివరాలు ప్రభుత్వం పరిశీలిస్తుందన్నారు. కొనుగోలు తేదీ, అనుమతించబడిన పరిమాణం వివరాలు రైతు ఫోన్‌కు మెసేజ్ రూపంలో పంపబడుతుందన్నారు. నాణ్యతలను బట్టి ధరను చెల్లిస్తారన్నారు. పొగాకు తాడు తీసి బేళ్ళు కట్టాలని, ఒకేరకమైన నాణ్యత కలిగి ఉండాలన్నారు. తేమ శాతం 20 శాతానికి మించితే తిరస్కరిస్తామన్నారు. ప్రతి బేలు కనీసం 25 కేజీలు గరిష్ఠంగా 150 కేజీలకు మించకుండా తీసుకురావాలన్నారు. పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభించే తేదీని త్వరలో ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో రైతు శిక్షణా కేంద్రం డీడీఏ శివకుమారి, మండల వ్యవసాయాధికారి శ్రీలత పాల్గొన్నారు.

పంట కాలువలోకి సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు



తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ నిర్వాహకులు ఇష్టానుషారం వ్యవహరిస్తున్నారు. గతంలో వీరు నిర్వహిస్తున్న చేష్టలపై కథనాలు వెలువడినా అధికారులు నామమాత్రంగా చర్యలు తీసుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. గురువారం సెప్టిక్ ట్యాంకర్ క్లీనింగ్ నిర్వాహకులు పంట కాలువలో మలమూత్ర వ్యర్థాలను వదిలి అక్కడి నుంచి పరారైన సంఘటన వెలుగు చూసింది. సేకరించిన వివరాల ప్రకారం.. ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట నుంచి మాతాశ్రీ ఆశ్రమం మీదుగా ఉండవల్లి గుంటూరు చానల్ ఎక్స్‌క్లూయిస్‌కు వెళ్లే మార్గంలో గుంటూరు చానల్ పక్కన తెనాలి, గుంటూరు, తాడేపల్లి, మంగళగిరి తాగునీటి కాలువలో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలను వదిలివేశారు. గమనించిన స్థానికుడు జిలానీ అనే వ్యక్తి దీనిపై నిర్వాహకుడిని ప్రశ్నించారు. ఈ వాహనం మున్సిపాలిటీకి చెందినదని.. ఆ నీళ్లే తీసుకువచ్చి ఇక్కడ వదులుతున్నాను అంటూ నిర్వాహకుడు సమాధానం చెబుతూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

30న ఇస్కాన్ జగన్నాథ రథయాత్ర

28,29 తేదీల్లో 'రథ్‌ఫెస్ట్' వివిధ అంశాల్లో చిన్నారులు, యువతకు పోటీలు



పోస్టరును ఆవిష్కరించిన సింహగౌరదాస్

తెనాలి: 'ఇస్కాన్', తెనాలి ఆధ్వర్యంలో ఏటా నిర్వహిస్తున్న జగన్నాథ రథయాత్ర ఈనెల 30వ తేదీన జరగనుంది. నాలుగురోజులు జరిగే ఈ ఉత్సవాలకు సంబంధించిన రథ్ ఫెస్ట్ పోస్టర్లను గురువారం సాయంత్రం ఇస్కాన్‌లో ఆవిష్కరించి వివరాలను తెలియజేశారు. రథయాత్రకు ముందు ఈనెల 28, 29 తేదీల్లో రథ్ ఫెస్ట్ పేరిట పిల్లలకు, యువతకు సాంస్కృతిక పోటీలను జరపనున్నట్టు ఇస్కాన్, తెనాలి మేనేజరు హెచ్‌జీ సింహగౌరదాస్ వెల్లడించారు. వైకుంఠపురం దేవస్థానం ప్రాంగణంలో జరగనున్న పోటీల్లో నృత్యం, సంగీతం, నటన, వక్తృత్వం, రచన, చిత్రలేఖనం, క్రాఫ్ట్, ఫ్యాన్సీ డ్రెస్, ఇతిహాస క్విజ్, భగవద్గీత శ్లోక పఠనం వంటి అంశాల్లో 5–30 ఏళ్ల వరకు మూడు వయోవిభాగాల్లో 51 పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. పోటీల్లో పాల్గొనేవారు ఈనెల 26వ తేదీలోగా 7013132678, 7013127778 నంబర్లను సంప్రదించాలని కోరారు. 30వ తేదీన రథయాత్ర మధ్యాహ్నం 12 గంటలకు శివాజీచౌక్ నుంచి బయలుదేరుతుందని, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకు చేరుకుంటుంది. ఒకటో తేదీ రాత్రి వరకు అక్కడ ఏర్పాటుచేసే గుండిచా మందిరంలో జగన్నాథుడు, బలదేవుడు, సుభద్ర మాత కొలువై ఉంటారని తెలిపారు. ఒకటో తేదీ సాయంత్రం సుభద్ర దేవికి సౌభాగ్య సారె కార్యక్రమం ఉంటుందని వివరించారు. ఈ ఉత్సవానికి దేశం నలుమూలల్నుంచి కళాకారులు, విదేశీ భక్తులు వస్తారని చెప్పారు. విజయవాడకు చెందిన జిజ్ఞాస సాంస్కృతిక సంస్థ వారి క్యూరేషన్‌లో ఈ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. విలేకరుల సమావేశంలో కమలకాంత దాస్, జిజ్ఞాస నుండి రథయాత్ర క్యూరేటర్ రోహిణి వైష్ణవి, కన్వీనర్ వెంకటేష్ బత్తుల, గీతిక, మీనాక్షి, మేఘన, రవితేజ, మోహన కృష్ణ పాల్గొన్నారు.

పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్యకు ఘనసత్కారం



జ్ఞాన దివ్యను సత్కరిస్తున్న పంచాయతీ సర్పంచ్, సెక్రటరీ

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్య సేవలు అభినందనీయమని సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ కొనియాడారు. గురువారం పంచాయతీ కార్యాలయం వద్ద నాగం జ్ఞాన దివ్యను పంచాయతీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి గౌస్ మొహిద్దీన్ పాల్గొని జ్ఞాన దివ్యను దుశ్శాలువా, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ 7వ వార్డు సభ్యులు నాగం వెంకటేశ్వరరావు కుమార్తె జ్ఞాన దివ్య డెహ్రాడూన్‌లో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. అదే విధంగా మహారాష్ట్ర కొల్హాపూర్‌లో మే నెలలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నేషనల్ గోల్డ్ మెడల్ సాధించినట్లు వివరించారు. ఇవిగాక గతంలో అనేక రికార్డులు సాధించినట్లు చెప్పారు. గ్రామానికి మంచి పేరు ప్రతిష్ఠలు సాధిస్తున్న జ్ఞాన దివ్య భవిష్యత్‌లో క్రీడల్లో మరింత ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కల్పన, వార్డు సభ్యులు మంచాల శ్రీనివాస్, మంచాల సురేష్, తోట పానకాలరావు, సామరౌతు సతీష్, తన్నీరు శ్రీను, శ్రీను, తదితరులు ఉన్నారు.

నరేంద్రదేవ్ కాలనీలో జెండా చెట్టు నిర్మాణం తగదు



ప్రదర్శన చేస్తున్న కాలనీ వాసులు

తెనాలిలో కాలనీవాసుల భారీ ప్రదర్శన

తెనాలి: పట్టణ గాంధీనగర్‌లోని నందులపేట నరేంద్రదేవ్ కాలనీ (యానాది కాలనీ)లో నివసిస్తున్న షెడ్యూలు తెగలకు చెందిన యానాదులు, రెల్లి (పారిశుద్ధ్య కార్మికులు) గురువారం పట్టణంలో భారీ ప్రదర్శన చేశారు. తమ కాలనీలో జెండా జెట్టు ఏర్పాటు ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ చేసిన ప్రదర్శన అనంతరం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం, మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. 1963లో మురికి వాడల నిర్మూలన పథకం కింద తమకు స్థలాలను కేటాయించారని, 1968లో కాలనీ నిర్మాణం చేసి తమకు క్వార్టర్స్ కేటాయించారని తెలిపారు. అప్పట్లో 81 కుటుంబాలతో మొదలైన కాలనీలో ఇప్పుడు 200 కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. తామంతా హిందువులమనీ, కాలనీలో తమ కులదేవత పోలేరమ్మ గుడిని నిర్మించుకుని జీవిస్తున్నట్టు తెలిపారు. తర్వాత అక్కడ కమ్యూనిటీ హాలు కట్టిస్తున్నామని చెప్పి, ఉర్దూ స్కూలు నిర్మించారని తెలిపారు. కాలనీలో ఒక ముస్లిం కూడా లేరనీ, అయినా తమ పిల్లలకు బహుమతుల ఆశ చూపి ఉర్దూ స్కూలులో చేరమంటున్నారని రెడ్డి రమణమ్మ ఆరోపించారు. పైగా ఇప్పుడు పోలేరమ్మ అమ్మ వారికి కేవలం మూడు గజాల దూరంలో ముస్లిం పీర్లు కట్టుకోవటానికి సిమెంటు దిమ్మె నిర్మాణానికి పూనుకున్నారనీ, వీరికి మున్సిపల్ అధికారులు కూడా సహకరిస్తున్నారని ఆరోపించారు. పీర్ల చావిడి/పీర్లు కట్టుకునే దిమ్మ నిర్మాణానికి అనుమతించరాదని డిమాండ్ చేశారు. రికార్డుల ప్రకారం కమ్యూనిటీ హాలుగా ఉన్న ఆ ఉర్దూ స్కూలును కూడా కమ్యూనిటీ హాలుగా మార్చాలని విజ్ఞప్తిచేశారు. కె.అశోక్‌కుమార్, డి.రమేష్, టి.రమేష్, కె.లక్ష్మీదేవి, మహాలక్ష్మయ్య, ఎం.గంగ, సుభాషిణి, శివకుమారి, అమల, నక్కా సాంబశివరావు, ఎం.పోలమ్మ, ఎ.నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

వానరాలతో ఇక్కట్లు!



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో వానరాల బెడద ఎక్కువైంది. పదుల సంఖ్యలో ఉన్న వానరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయం భయంగా రావాల్సి వస్తోందని వాపోతున్నారు. గ్రామంలోని రాజాపేట, కొండ మెట్లబజార్, జెండాచెట్టు సెంటర్, రామాలయం వీధి, బాల ఏసుదేవాలయ సమీప ప్రాంతం, హైస్కూల్ సెంటర్ ప్రాంతాల్లో ఈ వానరాలు గుంపులు గుంపులుగా చేరుతున్నాయి. పాఠశాలలకు వెళుతున్న పిల్లలు, పనులకు వెళ్లే వారి వెంటపడి కొందరిని గాయపరిచాయి. పంచాయతీ అధికారులు స్పందించి వానరాలను పట్టించి అడవి ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిడమర్రు రోడ్డు విస్తరణకు సన్నాహాలు

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి నగర పరిధిలోని నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సీఆర్‌డీఏ అమరావతికి ప్రధాన రహదారి అయిన నిడమర్రు రోడ్డు విస్తరణకు అధికారులు శ్రీకారం చుట్టారు. రోడ్డు విస్తరణకు ఎలాంటి అభ్యంతరాలు లేకపోయినా ప్రభుత్వం నిర్ణయంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంగళగిరి స్థానిక పాతబస్టాండ్ సెంటర్ నుంచి నిడమర్రు మీదుగా అమరావతి సచివాలయానికి 155 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో నిడమర్రు రోడ్డు లోని పలు నివాసాలు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేకాక నిడమర్రు, కురగల్లుతో పాటు పలు గ్రామాలలో స్థానికులు నివాసాలను సగానికిపైగా కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. గత రెండు రోజులుగా సీఆర్‌డీఏ సిబ్బంది సర్వే చేస్తుండగా స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ చేపట్టడానికి తాము వ్యతిరేకం కాదని.. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్ణయం మార్చుకుని రోడ్డు విస్తరణను తగ్గించి తమకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు విస్తరణలో నష్టపోతున్న తమకు సరైన నష్టపరిహారం అందేలా అధికారులు, ప్రభుత్వం చూడాలని కోరుతున్నారు.